సమాచారం

27న గీతంలో జీపాట్‌పై అవగాహన

పటాన్‌చెరు టౌన్‌: గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ సహకారంతో గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ (జీసీజీసీ) ఈనెల 27వ తేదీన గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్ (జీపాట్)లో ఉత్తీర్ణత సాధించడంపై అవగాహన కల్పించనున్నారు. జీసీజీసీ అధికారి డాక్టర్ రమాకాంత్ బాల్ శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. హైదరాబాద్‌లోని మాస్టర్ ఫార్మా సొల్యూషన్స్ (రీసెర్చ్ సెంటిస్ట్) మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దినేశ్ నీరడి ముఖ్య వక్తగా పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాల కోసం 08455-221313 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

'సండే ఈవినింగ్ టాక్'..

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సా 6.30 గం నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది.'యాన్ ఇన్‌స్పిరేషనల్ లైఫ్ స్టోరీ ఆఫ్ బ్రహ్మ బాబా' అనే అంశంపై బ్రహ్మకుమారీస్ సంస్థ హైదరాబాద్ సబ్ జోన్ డైరెక్టర్ బి.కె.కుల్‌దీప్‌దీదీ ప్రత్యేక ప్రసంగం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం 040-23001234లో సంప్రదించవచ్చు.

మోమిన్ సుమయ్యకు పీహెచ్‌డీ



రాయదుర్గం: మనూలోని విద్యా, శిక్షణ విభాగంలో పరిశోధక విద్యార్థిని మోమిన్ సుమయ్యసలీమ్ అహ్మద్‌కు సోషల్ మీడియా ఇంపాక్ట్‌పై పీహెచ్‌డీని ప్రకటించారు. ఉర్దూ యూనివర్సిటీ ప్రొఫెసర్ సిద్ధిఖీ మోహద్ పర్యవేక్షణలో 'యూనివర్సిటీ విద్యార్థుల శారీరక, మానసిక, ఆరోగ్యం, సామాజిక సంబంధాలు, విద్యావిషయక సాధనపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు. ఆమెను పలువురు పరిశోధక విద్యార్థులు అభినందించారు.

క్లుప్తంగా...

బహిరంగ ప్రదేశాలలో గాలిపటాలు ఎగరవేయాలి

మియాపూర్: సంక్రాంతి పండగ సందర్భంగా గాలిపటాలను ఎగురవేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, సురక్షిత ప్రాంతాలలో ఎగురవేయాలని విద్యుత్ అధికారులు రాజ్‌కుమార్, హరిసింగ్‌లు సూచించారు. విద్యుత్‌లైన్ల వద్ద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద గాలిపటాలను ఎగురవేయవద్దని తెలిపారు. విద్యుత్ అంతరాయాలు కలుగుతాయని తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో ఎగరవేయాలని కోరారు. ఎక్కడైన విద్యుత్ తీగలకు అంతరాయం కలిగే విధంగా ఉంటే సమాచారం ఇవ్వాలని కోరారు.

హెచ్‌సీయూ-ఫెర్నాండెజ్ ఫౌండేషన్ ఒప్పందం



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఫెర్నాండెజ్ ఫౌండేషన్‌ల మధ్య శుక్రవారం ఒప్పందం కుదిరింది. విద్యామార్పిడి, పరిశోధన, అనువాద పరిశోధన కార్యక్రమాలను చేపట్టడం కోసం 3 సంవత్సరాల ఒప్పందం కుదిరింది. హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, చైర్‌పర్సన్ డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్ సమక్షంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

మాకు న్యాయం చేయండి...

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తమ ఇంటి స్థలాల చుట్టూ రేకులు వేసుకుంటే వాటిని కొందరు తొలగించారని వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని లక్ష్మీపురం ప్లాట్ ఓనర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సత్తయ్య, కార్యదర్శి బసవయ్య, ఉపాధ్యక్షులు మూర్తి , ఎగ్జిక్యూటివ్ సభ్యులు మల్లేశం కోరారు. శుక్రవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ గత 40 ఏళ్ల క్రితం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ప్లాట్లకు సంబంధించిన భూమి చుట్టూ రేకులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దాని బుధవారం సాయంత్రం కొందరు తొలగించడం బాధాకరమన్నారు.

శిల్పారామంలో సంక్రాంతి సంబురాలు



గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల ఆశీర్వాదాలు, జంగమదేవరల నాట్యాలతో శిల్పారామం కళకళలాడింది. మాదాపూర్‌లోని శిల్పారామంలో శుక్రవారం సంక్రాంతి సంబురాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 17వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ వేడుకల్లో గంగిరెద్దుల విన్యాసాలు సందర్శకులను అలరించనున్నాయి. పల్లెటూరిలో కనిపించే హరిదాసులు, జంగమదేవరలు, పిట్టలదొర, బుడబుక్కలు ఎరుకలసాని తదితర కళాకారులు శిల్పారామంలో సందర్శకులను అలరించనున్నారు. కళాకారులు తాము ధరించిన వేషాల చరిత్రను కథల రూపంలో వివరిస్తున్నారు. 14వ తేదీ భోగి పండుగను పురస్కరించుకుని శిల్పారామం ఆవరణలో 11 సంవత్సరాల లోపు పిల్లలకి భోగిపళ్ళు పోయించుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా బొమ్మల కొలువును నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్‌రావు తెలిపారు. ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలలో బాగంగా కళామండలం ప్రసాద్‌వే కథాకళి ప్రదర్శన, బాలత్రిపుర సుందరి శిష్యబృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనలు, చంద్రశేఖర్ శిష్యబృందంచే శ్రీగోదా కల్యాణం నృత్య రూపకాన్ని ప్రదర్శించనున్నారు. శిల్పారామంలో ఎడ్లబండి, బ్యాటరీకార్ సవారీ, బోటింగ్, పిల్లల ఆటస్థలంలతో పాటు హస్తకళా ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. -మాదాపూర్

సాంస్కృతిక కార్యక్రమాలు

సంక్రాంతి సంబురాలలో భాగంగా కళామండలం ప్రసాద్‌వే కథాకళి, రూప శిష్యబృందంచే ఇండియన్ కాన్‌టెంపరరీ డ్యాన్స్ జుగల్బందీ ప్రదర్శన, ప్రముఖ కూచిపూడి నృత్యగురువు చావలి బాలత్రిపుర సుందరి శిష్యబృందం నృత్యప్రదర్శన అలరించింది.















లింగంపల్లి రైల్వేస్టేషన్ కిటకిట..

శేరిలింగంపల్లి: సంక్రాంతిని పురస్కరించుకుని లింగంపల్లి రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. పండుగలకు స్వస్థలాలకు బయలుదేరిన నేపథ్యంలో రద్దీ పెరిగింది. అదే విధంగా స్పెషల్ ట్రైన్స్ కూడా ఈ స్టేషన్ మీదుగా వెళ్తుండటంతో స్టేషన్ కిటకిటలాడుతోంది. సాధారణ రోజుల్లో ఈ స్టేషన్ నుంచి 9, 10 వేల మంది రాకపోకలు సాగిస్తుండగా, పండగ సీజన్‌లో నిత్యం 18వేల మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లిలో ఏళ్ల నాటి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని మసీదుబండ లోని ప్రభుపాద లేఔట్ కాలనీలో జరుగుతున్న వరదనీటి కాలువ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాశ్వతప్రాతిపదికన డ్రైనేజీ, వరదనీటి సమస్యలు తీర్చడానికి వరద నీటి కాలువలు, నాలాల నిర్మాణం, విస్తరణ పనులను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సర్కిల్ ఏఈ సునీల్, నాయకులు రాజుయాదవ్, శ్రీనివాస్‌యాదవ్,పద్మారావు, కృష్ణయాదవ్, వేణుగోపాల్‌రెడ్డి, రమణయ్య, మల్లేష్, నగేష్, పవన్ పాల్గొన్నారు. అలాగే కొత్తగూడ కూడలిలో రూ.70 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ ప్రశాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శర్మ నాయకులు ఊట్ల కృష్ణ, లక్ష్మీనారాయణ, సుబ్బయ్య, నరేందర్, వినయ్ పాల్గొన్నారు.



కొత్తగూడ కూడలిలో సీసీరోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

జ్ఞానాన్ని పెంచుకోవాలనే తపన విద్యార్థుల్లో ఉండాలి

రాయదుర్గం: జ్ఞానాన్ని పెంచుకోవాలనే తపన విద్యార్థుల్లో ఉండాలని రైల్వేబోర్డు ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.జి.భూమా అన్నారు. గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల, పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినులనుద్దేశించి ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకంటూ ఒక లక్ష్యాన్ని ఎంచుకొని, దానిని సాధించేవరకు దృఢంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో గురుకుల విద్యాలయాల జాయింట్ సెక్రటరీ శారద, డిప్యూటీ కార్యదర్శి వెంకటలక్ష్మి, ఆర్‌సీఓ డాక్టర్ శారద, ప్రిన్సిపల్స్ శారద, పాపారావు పాల్గొన్నారు.



వి.జి.భూమాకు స్వాగతం పలుకుతున్న గురుకుల విద్యాలయాల అధికారులు

ఎస్టీపీ పనులు పరిశీలన

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని పటేల్ చెరువు వద్ద 7.0 ఎంఎల్‌డి సామర్థ్యంతో రూ.26.27 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో జరుగుతున్న ఎస్టీపీ నిర్మాణ పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, అధికారులతో కలసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీపీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధిలో హైదరాబాద్ నగరం దేశంలోనే ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మంజూరైన 7 ఎస్టీపీ వివరాలను తెలిపారు. కార్యక్రమంలో జలమండలి ఎస్టీపీ విభాగం అధికారులు డీజీఎం శ్రీనివాసరాజు, మేనేజర్ శంకర్, మెగాప్రాజెక్టు ఇంజనీర్ వెంకట్‌రామిరెడ్డి , బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



పటేల్‌చెరువు వద్ద ఎస్టీపీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్‌: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి . శుక్రవారం 15 మందికి ర్యాపిడ్ యాంటిజెన్ పరీక్షలు నిర్వహించగా అందరికీ నెగెటివ్‌గా నిర్ధారణ అయినట్టు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 13 మందికి నిర్వహించినట్టు పేర్కొన్నారు.

క్రైం కార్నర్..

రోడ్డు ప్రమాదం.. ఆటోడ్రైవర్ దుర్మరణం



ప్రతాపఅరుణ్ (ఫైల్)

పటాన్‌చెరుటౌన్: రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ దుర్మరణం చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ దుర్గయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన ప్రతాప శ్రీనివాస్ కుమారుడు ప్రతాప అరుణ్ (25) బతుకుదెరువు కోసం రెండు నెలల క్రితం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ వచ్చాడు. ఆనంద్ సెంట్రింగ్ మేస్త్రి వద్ద ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం పనిపై పటాన్‌చెరు వచ్చి, బైక్‌పై తిరిగి వెళ్తుండగా నవపాన్ సమీపంలో వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం బైకును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి



వెంకట సోమసుందర శర్మ(ఫైల్)

మియాపూర్: ట్రావెల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. దువ్వూరి వెంకట సోమ సుందర శర్మ (58) మియాపూర్‌లోని ప్రజయ్‌సిటీ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటూ బాలానగర్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం రాత్రి విధులను ముగించుకుని తిరిగివస్తుండగా ఆల్విన్ క్రాస్ సమీపంలో జాతీయరహదారిపై చందానగర్ నుండి కూకట్‌పల్లి వెళుతున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ఢీకొంది. దీంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే చనిపోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు బస్సు డ్రైవర్ ఆకుమర్తి రవిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలనీ యువకులతో రాత్రి గస్తీ రెడీ

టీఎన్‌జీఓ కాలనీలో శ్రీకారం చుట్టిన పోలీసులు

రాయదుర్గం: పోలీసులు రాత్రి గస్తీలో కాలనీ యువకులను కూడా భాగస్వాములను చేస్తూ నేరాలు, దొంగతనాలను అరికట్టడానికి యత్నాలు ప్రారంభించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని టీఎన్‌జీఓ కాలనీ, సెక్రటేరియట్ కాలనీ, రంగారెడ్డిజిల్లా టీఎన్‌జీఓ కాలనీలోని వారు పండుగ నేపథ్యంలో స్వగ్రామాలకు తరలివెళ్ళినందున రాత్రి వేళ దొంగతనాలు చోటు చేసుకోకుండా కాలనీలలో పోలీసులతో కలిసి స్థానిక యువకులను కూడా ఎంపిక చేశారు.ఆయా కాలనీల్లో అదనపు డీసీపీ నర్సింహారెడ్డి, మాదాపూర్ ఏసీపీ రఘునందన్‌రావు, గచ్చిబౌలి పీఎస్ ఇన్‌స్పెక్టర్ జి సురేష్, ఎస్‌ఐ శోభన్‌బాబు, పెట్రోలింగ్ టీమ్‌తో కలిసి ఆయా కాలనీల్లో ఫూట్ పెట్రోలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పోలీసులకు స్థానికులు సహకరిస్తే నేరాలను అరికట్టడం సులభమవుతుందన్నారు.



టీఎన్‌జీఓ కాలనీలో స్థానిక యువతతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

ఇంటి పన్ను తగ్గిస్తూ ఉత్తర్వులు

సాక్షి ఎఫెక్ట్..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇంటి పన్ను సమస్యపై గురువారం 'సాక్షి'లో 'పన్నుపోటు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంత్రి హరీశ్‌రావు చొరవతో ఇంటి పన్ను 0.18 శాతాన్ని తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో మున్సిపల్ చైర్ పర్సన్ లలితా సోమిరెడ్డి అధ్యక్షతన ఇంటి పన్ను తగ్గించాలని సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపించారు. దీంతో ఇంటి పన్ను 0.18 శాతం తగ్గిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా మున్సిపాలిటీని ఆనుకొని ఉన్న జీహెచ్‌ఎంసీ మాదిరిగా ఇంటి పన్ను వసూలు చేయాలని కొన్ని రోజుల క్రితం నైబర్ హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్‌కు 4,500 లేఖలు రాసిన విషయం తెలిసిందే.

ముగ్గుల పోటీలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎంఐజీ కాలనీలో సింధు ఆదర్శం మహిళా మండలి అధ్యక్షురాలు రాణి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను శుక్రవారం కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతి రోజున ప్రతి ఇంటి ముందు రంగు, రంగుల ముగ్గులు వేయడం సాంప్రదాయమన్నారు. కార్యక్రమంలో మహిళా మండలి ప్రతినిధులు శ్రీదేవి, మణిమాల, జ్యోతి, ఫాతిమా, రాధ, సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

గీత భూపాల్ రెడ్డి జూనియర్ కళాశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కళాశాల విద్యార్థులు రంగురంగుల ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. విజేతలకు కార్పొరేటర్లు పుష్ప నగేష్, సింధు ఆదర్శ్ రెడ్డిలు బహుమతులను ప్రదానం చేశారు.



గీత భూపాల్ రెడ్డి కళాశాలలో ముగ్గులను పరిశీలిస్తున్న కార్పొరేటర్లు పుష్ప నగేష్, సింధు రెడ్డి

పండగల్లో సంక్రాంతికి ఎంతో ప్రాధాన్యం

పటాన్‌చెరు టౌన్: తెలుగువారి పండగల్లో సంక్రాంతికి ఎంతో ప్రాధాన్యత ఉందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ అన్నారు.శుక్రవారం పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామ జిల్లా మహిళ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి రంగోలి కాంపిటీషన్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్ హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందజేశారు. భారతీనగర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవేందర్ గౌడ్, జిల్లా మహిళ మోర్చా నాయకులు సుజాత,శిరీష, ముత్తంగి వార్డు సభ్యులు దుబాయ్ అశోక్, యాదయ్య ,గ్రామస్తులు, ఎస్ఆర్‌కె యువసేన నాయకులు పాల్గొన్నారు.



మంచినీటి కటకట

- పదిరోజులు అవుతున్నా సరఫరా కాని తాగునీరు
- తీవ్ర ఇబ్బందులుపడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



బొల్లారం

జిన్నారం(పటాన్‌చెరు): తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పది రోజుల వరకు కూడా మంచినీటి సరఫరా లేకపోవటంతో ప్రజలు తహతహలాడుతున్నారు. నీటి సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు సూచించినా పట్టించుకోవటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో 50వేలకు పైగా జనాభా ఉంటుంది.
- ఇక్కడ పరిశ్రమలు ఎక్కువగా ఉండటంలో ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రజలు పరిశ్రమల్లో పనులు చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తుంటారు.
- జనాభాకు సరిపడా మౌలిక వసతులను కల్పించటంతో ఇక్కడి పాలకులు, అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి.
- మూడునెలల నుంచి పదిరోజులకు ఒకసారి కూడా తాగునీటి సరఫరా లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.
- మంజీరాతో పాటు కాళేశ్వరం నీటిని తాగునీటి కోసం వినియోగిస్తున్నా, సరఫరా మాత్రం నామమాత్రంగానే ఉంది.
- నిత్యం లక్షల లీటర్ల నీరు అవసరం ఉండగా, పదిరోజులకోసారి నీటి సరఫరా సక్రమంగా జరగటం లేదని ప్రజలు వాపోతున్నారు.
- ప్రైవేట్ ఆర్వో ప్లాంట్‌ల నుంచి ప్రజలు డబ్బు ఖర్చు చేస్తూ తాగునీటిని తెచ్చుకుంటున్నారు.
- సకాలంలో నీటిని సరఫరా చేయించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యే సహకారంతో సమస్య పరిష్కారానికి చర్యలు



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతో బొల్లారంలో ఏర్పడుతున్న తాగునీటి సమస్యను సత్వరమే పరి ష్కరించేలా చర్యలు చేపడుతున్నాం . మున్సిపల్ అధికారులు ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– చంద్రారెడ్డి, కౌన్సిలర్, బొల్లారం

సంస్కృతి, సాంప్రదాయాలకు పండగలు చిహ్నాలు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న కాలనీ అధ్యక్షుడు షేక్ ఖాసీం తదితరులు

శేరిలింగంపల్లి: సంస్కృతి, సాంప్రదాయాలకు పండగలు చిహ్నాలని గుల్‌మొహర్ పార్కు కాలనీ అధ్యక్షులు షేక్ ఖాసీం అన్నారు. గుల్‌మొహర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. సీనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో హారిక, శ్రీలక్ష్మీ, అర్పిత , జూనియర్స్ విభాగంలో వరుసగా సంధ్య, ప్రవలిక, సువర్ణ నిలిచారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా పద్మ, సరళలు వ్యవహరించారు. కాలనీవాసి సమీర్ పటేల్ బహుమతులను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శివయ్య గౌడ్, కాలనీవాసులు మోహన్ రావు, అలీఖాన్, రజా, శేఖర్‌రావు, శేషసాయి, ప్రభాకరా చారీ, జైరాజ్ సింగ్, వెంకటేశ్వర్లు, సత్యం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కాలనీలో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు